




www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక


తెలంగాణ | మంగళ వారం, 27 డిసెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృద్విరాజు | సంపుటి - 07, సంచిక-220 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak


## హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ముర్ము

### రాష్ట్రపతిని ఘనంగా స్వాగతించిన గవర్నర్ తమిళిసై, మండలి చైర్మన్, స్పీకర్‌లతో కలిసి స్వాగతం పలికిన సిఎం కెసిఆర్





- గవర్నర్ తమిళసైతో సిఎం కెసిఆర్ మాటామంతీ
- శ్రీశైలం చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఘనంగా స్వాగతం పలికిన మంత్రులు, అధికారులు
- భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు
- 2న భద్రాచలంలో రాష్ట్రపతి ముర్ము పర్యటన
- భారీగా భద్రతా ఏర్పాట్లు చేసిన అధికారులు



**హైదరాబాద్, డిసెంబర్ 26 (సమ సమాజం):** హైదరాబాద్ విడిది కోసం వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హకీంపేట ఎయిర్‌బేస్‌లో గవర్నర్ తమిళసై, ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనస్వాగతం పలికారు. రాష్ట్రపతిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం 3వ

## ఫామ్‌హౌజ్ కేసులో కీలక మలుపు

### కేసును సిబిఐ విచారణకు అప్పగిస్తూ హైకోర్టు తీర్పు



సిట్ విచారణ నిలిపివేత..రికార్డులు సిబిఐకి అప్పగించాలని ఆదేశం

చంచల్‌గూడ జైలులో నందకుమార్‌పై ఇడి విచారణ

**హైదరాబాద్, డిసెంబర్ 26 (సమ సమాజం):** ఎమ్మెల్యేల కొనుగోలుకు సంబంధించి ఫాం హౌస్ కేసులో కేసీఆర్ సర్కారుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసుకు సంబంధించి హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసును సీబీఐకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేసును దర్యాప్తు చేస్తున్న స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం.. సిట్‌ను రద్దు చేసిన న్యాయస్థానం తక్షణమే దాన్ని సీబీఐకి అప్పగించాలని ఆదేశించింది. సిట్ వద్ద ఉన్న వివరాలు, ఇప్పటి వరకు జరిపిన దర్యాప్తునకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని సీబీఐకు ఇవ్వాలని చెప్పింది. అలాగే సిట్ దర్యాప్తు కూడా నిలిచిపోనుంది. ఫాంహౌస్ కేసులో సిట్ దర్యాప్తుపై 3వ

## శ్రద్ధావాకర్ దారుణ హత్యోదంతం కేసు

### కీలక ఆధారాలు పట్టుకున్న పోలీసులు

ఆడియో టేపుల్లో శ్రద్ధ హింసకు సంబందించిన ఆధారాలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 26 (సమ సమాజం):** శ్రద్ధావాకర్ దారుణ హత్యోదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. శ్రద్ధా హత్య కేసులో ఢిల్లీ పోలీసులకు కీలక ఆడియో ఆధారాలు లభించాయి. అఫ్తాబ్‌కి సంబంధించిన ఆడియో పోలీసులకు దొరికింది. ఇందులో అఫ్తాబ్, శ్రద్ధతో గొడవపడుతున్నాడు. ఈ ఆడియోలో అఫ్తాబ్, శ్రద్ధా మధ్య వాదన వినిపిస్తోంది. అంతే కాదు అఫ్తాబ్ శ్రద్ధాను చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు ఆడియో ద్వారా రుజువైంది. ఈ 3వ

## నిమ్స్‌లో నిర్మలమ్మకు వైద్య పరీక్షలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 26 (సమ సమాజం):** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అస్వస్థతకు గురయ్యారు. ఆమెను చికిత్స నిమిత్తం ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలోని ఓ ప్రైవేటు వార్డులో వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆమె అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. ఆదివారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా.. ఢిల్లీలోని 'సదైవ్ అటల్'లో సీతారామన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల, తమిళనాడులోని ఒక విశ్వవిద్యాలయంలో జరిగిన కాన్వొకేషన్ వేడుకలోనూ ఆమె పాల్గొన్నారు. అయితే ఆమె రెగ్యులర్ చెకప్‌లకు వెళ్లారని కూడా అంటున్నారు. ఎలాంటి అస్వస్థత లేదన్నారు.

## లిక్కర్ స్కామ్‌లో కవితను అరెస్ట్ చేయాలి

### మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ డిమాండ్



**కరీంనగర్, డిసెంబర్ 26 (సమ సమాజం):** ప్రజల సొమ్ము దోచుకుని ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో పెట్టిన కవితను అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ డిమాండ్ చేశారు. రాక్షసుల్లాంటి కేసీఆర్ 3వ

## ఉపాధి నిధులు కాంట్రాక్టర్లకు మళ్లించారు



రాష్ట్ర వాటా ఇవ్వకపోగా కేంద్రంపై నెపం

బిఆర్ఎస్ ప్రభుత్వంపై మండిపడ్డ ఎంపి లక్ష్మణ్

**హైదరాబాద్, డిసెంబర్ 26 (సమ సమాజం):** కేంద్రం ఉపాధి నిధులు ఇస్తే.. రూ.150 కోట్లు కాంట్రాక్టర్లకు దారి మళ్లించారని రాజ్యసభ బిజెపి ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. రాష్ట్రం వాటా ఇవ్వకపోగా కేంద్రం మీద నెపం నెడుతున్నారని ఆయన ఫైర్ అయ్యారు. రూ. 5 లక్షల కోట్ల అప్పులు చేసి ఏం చేశారని నిలదీశారు. ప్రజలు నిలదీస్తుంటే సమాధానం చెప్పలేక బీజేపీపై నెపం నెడుతోందని రాష్ట్ర ప్రభుత్వంపై లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం చిన్న కులాలకు న్యాయం చేస్తోందని లక్ష్మణ్ అన్నారు. ఎస్టీలకు రిజర్వేషన్ పెంపు విషయంలో కేసీఆర్ మోసం చేశారని ఆయన ఆరోపించారు. పనికి ఆహారం పథకంలో పనులు కాంట్రాక్టర్లకు ఇచ్చి నిధుల దుర్వినియోగం చెయ్యడాన్ని పార్లమెంట్ సాక్షిగా చెప్పే అవకాశం వచ్చిందని గుర్తు చేశారు. రైతులకు కేసీఆర్ సర్కార్ అత్యంత ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణలో ఫసల్ భీమా అమలుకు నోచుకోవడం లేదన్నారు. రాజ్యసభలో తెలంగాణ, అటు ఆంధ్ర గొంతుగా మారడం అదృష్టంగా భావిస్తున్నానని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ఇటీవల రాజ్యసభలో సమస్యలపై చర్చించిన అంశాలను ఆయన ప్రస్తావించారు. జ్యసభ సభ్యునిగా కొత్త అనుభూతి కలిగిందన్నారు. ప్రతిపక్షాలు అంతరాయం పెట్టినా అర్థవంతమైన చర్చలు 3వ

## అధికారుల ముందే పప్పులో పురుగుల పట్టివేత

### కస్తూర్బా హాస్టల్‌కు మూడ్రోజుల సెలవులు

**ఆదిలాబాద్, డిసెంబర్ 26 (సమ సమాజం):** నేరడిగొండ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో మరోసారి పప్పులో పురుగులు వచ్చాయి. డీఈఓ, సెక్టోరియల్ ఆఫీసర్ల సమక్షంలోనే వంటలు చేయించినా పప్పులో పురుగులు రావడంపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ సిబ్బందిని మార్చాలని డిమాండ్ చేశారు. 3వ

## కొనసాగుతున్న సెస్ ఎన్నికల కౌంటింగ్

వేములవాడలో ఇరు పార్టీల ఘర్షణ..లాఠీఛార్జ్

ఎట్టకేలకు వేములవాడలో బిజెపి అభ్యర్థి తిరుపతి గెలుపు

ప్రకటించిన ఎన్నికల అధికారులు



**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 26 (సమ సమాజం):** జిల్లాలో సహకార విద్యుత్ సరఫరా సంఘం సెస్ ఎన్నికల కౌంటింగ్ లో గందరగోళం కొనసాగుతోంది. సెస్ ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల హవా కొనసాగుతోంది. జిల్లాల్లో 12 స్థానాల్లో బీఆర్ఎస్ లీడ్ లో ఉండగా.. వేములవాడ రూరల్ లో బీజేపీ విజయం సాధించింది. అయితే చాలా 3వ

## సీల్ లేకుండా సెస్ బ్యాలెట్ బాక్సులు

### అభ్యర్థి ఆందోళనతో ఉద్రిక్తత

**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 26 (సమ సమాజం):** జిల్లాలోని గంభీరావుపేటలోని సెస్ ఎన్నికల కౌంటింగ్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. కొత్తపల్లి గ్రామ బ్యాలెట్ బాక్సులు సీల్ లేకుండా ఉన్నాయని ఇండిపెండెంట్ అభ్యర్థి, బీజేపి ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికార పార్టీ జులుం నశించాలంటూ కౌంటింగ్ కేంద్రం వద్ద ధర్నాకు దిగారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. మరోవైపు రుద్రంగిలో బీఆర్ఎస్ బలపరిచిన ఆకుల గంగారం అనే అభ్యర్థి 36 ఓట్లతో గెలిచారు. బీఆర్ఎస్ అభ్యర్థికి 523, స్వతంత్ర అభ్యర్థికి 487 ఓట్లు లభించాయి.

## గచ్చీబౌలిలో టిప్పర్ బీభత్సం

నాలుగు కార్లు, రెండు బైకులు ధ్వంసం

ప్రమాదంలో డెలివరీ బాయ్ మృతి



**హైదరాబాద్, డిసెంబర్ 26 (సమ సమాజం):** గచ్చిబౌలిలోని విప్రో సమీపంలో టిప్పర్ బీభత్సం సృష్టించింది. సిగ్నల్ దగ్గర ఆగి ఉన్న 4 కార్లు, 2 బైక్‌ల మీదకు దూసుకెళ్లింది. రెడ్ సిగ్నల్ పడటంతో ఆగివున్న వాహనాలను టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 4 కార్లు నుజ్జునుజ్జు కాగా, 2 బైక్‌లు ధ్వంసమయ్యాయి. ఘటనా స్థలంలో ఫుడ్ డెలివరీ బాయ్ నసీర్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సంపాదకీయం

# ఉపాధిహామీ ఉపయోగహామీ కావాలి !

ఉపాధిహామీ వల్ల ఏదైనా మంచి జరిగిందంటే..అది తెలంగాణలో రైతులకు కల్లాలను నిర్మించడమే. దేశంలో ఎక్కడా ఈ పథకంతో నిర్దుష్టమైన పనులు జరగలేదు. దీనిని వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్న డిమాండ్‌పైనా పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో గత కొన్నేళ్లుగా వేలకోట్లు వృథా అవుతున్నాయి. చెరువుల పూడికతీత, వాటర్ షెడ్ల నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్న డిమాండ్లు వస్తున్నాయి. అయితే ఇవేమీ పట్టించుకోగ పోగా తెలంగాణలో నిర్మాణాత్మ కంగా చేపట్టిన రైతు కల్లాలపై కొర్రీలు పెడుతున్న కేంద్రం ఆ డబ్బులు వాస్ చేయాలన్న డిమాండ్ తీసుకుని వచ్చింది. రైతులకు మేం సాయం చెయ్యం.. చెయ్యనీయం అన్నట్టుగా కేంద్రం తీరు ఉంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు నిర్మించుకున్న పంటల ఆరబోతకు కల్లాలను నిర్మించుకుంటే కేంద్రానికి అభ్యంతరం ఉండరాదు. దీనిపై కేంద్రం కావాలనే రాద్ధాంతం చేస్తుందని గమనించాలి. ఇంత మంచి కార్యక్రమం కోసం రైతులకు తెలంగాణ ప్రభుత్వం చేసిన సహాయాన్ని ఉపాధి హామీ నిధుల మళ్లింపు అంటూ దుష్ప్రచారం చేయడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలి. దీనికి నిరసనగా ఇటీవల బిఆర్ఎస్ రైతు ధర్నాలతో నిరసనను కూడా తెలియచేసింది. వ్యవసాయ అనుబంధ పనులను ఉపాధి హామీకి అనుసంధానం చేయాలన్న డిమాండ్ దేఊశవ్యాప్తంగా ఉంది. దీనిని పక్కనపెట్టిన కేంద్రం మొత్తం పథకాన్ని నీరు కార్చేలా అనేక షరతులు, కోతలను తీసుకొచ్చిందని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విమర్శిస్తున్నాయి. నిజానికి గ్రామాల్లో కొవిడ్ కష్టకాలం తర్వతా ఉపాధి అవకాశాలు తగ్గాయి. గ్రామీణ అర్థిక వ్యవస్థ సంక్షోభంలో చిక్కుకుంటున్నది. ఈ క్రమంలో గ్రాసమస్థాయిలో పనులు పెంచడం, విస్తరించడం ద్వారా ఉపాధిహామీని బలోపేతం చేయడంతో ప్రజలకు, కార్మికులకు పనులు కల్పించాలి. అయితే కేంద్రం మాత్రం ఉపాధి హమీకి నిధులు తగ్గిస్తూ వస్తున్నదన్న విమర్శలు కూడా ఉన్నాయి మరోవైపు పెరిగిన ఎరువులు పెట్రోల్ ధరలు, ఇతర ఖర్చుల పెరుగుదల వలన వ్యసాయరంగం పంట పెట్టుబడులు పెరుగు తున్నాయి. ఈ క్రమంలో రైతులను అదుకునేందుకు వ్యవసాయంతో ఉపాధి హమీని అనసంధానం చేయాల ని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణలో రైతులకు అత్యంత ఉపయుక్తంగా ఉన్న వ్యవసాయ కల్లాల నిర్మాణా నికి ఖర్చుయిన రూ.151 కోట్లను తిరిగి చెల్లించాలని కేంద్రం రాష్ట్రానికి నోటీసు ఇవ్వడంపై ఇప్పుడు సర్వత్రా చర్చకు దారితీసింది. నిజానికి ఈ నిధులను తెలంగాణ ప్రభుత్వం దుర్వినియోగం చేయలేదు. సరికదా రైతులకు ఉపయోగపడేలా చేసింది. ఇది ముమ్మాటికి కేంద్రం చూపుతున్న వివక్షే తప్ప మరోటి కాదు. రాష్ట్రంలో రైతులు కట్టుకున్న వ్యవసాయ కల్లాలతో కలుగుతున్న ప్రయోజనాలను అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి.

తెలంగాణపై వ్యతిరేకతతో ఆ నిధులను వెనక్కి ఇవ్వాలని మోడీ ప్రభుత్వం నోటీసులు ఇవ్వడమే ఆక్షేపణీయం. ఇకపోతే తీర ప్రాంతాల్లోని రాష్ట్రాల్లోలో చేపలు ఎండబెట్టు కునేందుకు ఇదే తరహా సిమెంట్ కల్లాలను ఉపాధి హామీ పథకంలో భాగంగా అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మించాయి. ఇది కూడా ఓ రకంగా మంచిపనిగానే చూడాలి. కల్లాల నిర్మాణానికి, చేపలు ఎండబెట్టే వేదికల నిర్మాణానికి పెద్దగా తేడా లేదు. కానీ కేంద్రం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో రైతులు నిర్మించు కున్న కల్లాలపై మాత్రం ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తోందో చెప్పడం లేదు. అయితే ఉపాధిహామీలో భాగంగా రూ. 750 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో నిర్మించాలనుకున్న 79000 వ్యవసాయ కల్లాల నిర్మాణాలను మోడీ ప్రభుత్వం అడ్డుకుందని బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఉపాధిహామీ పనులతో రైతులు ఉపయోగం జరిగితే తప్పేంటని మంత్రి కెటిఆర్ ప్రశ్నించారు. వ్యవసాయ రంగంలో దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ

ఉన్నదని ఆయన తెలిపారు. కార్పొరేట్లకు రాయితీల వర్షం కురిపిస్తున్న కేంద్రప్రభుత్వం పేదలకు ప్రయోజ నకారిగా ఉన్న ఉపాధి హామీ చట్టం ఉసురు తీసేందుకు ప్రయత్నించడం ఆందోళనకరం. నరేంద్ర మోడీ గద్దెనెక్కినప్పటి నుండి 'ఉపాధి' పట్ల చిన్నచూపు చూస్తున్నారు. కనీసం వంద రోజులైనా పని కల్పించాలని, కోరుకున్న వారందరికీ పని ఇవ్వాలనేది ఈ చట్టం ముఖ్య ఉద్దేశం. ఇది దుర్వినియోగం అవుతోందని తాజా గా గ్రామీణాభివృద్ధి శాఖ మాజీ కార్యదర్శి అమర్‌జిత్ సిన్హా నేతృత్వంలోని కమిటీ నియామకం జరిగింది. ఈ చట్టంలో తీసుకురావాల్సిన మార్పులు, కేటాయించే పనులు, వాటిలో తీసుకుని రావాల్సిన మార్పులు, ఖర్చులు, రాష్ట్రాల మధ్య తేడాలు లాంటి అంశాలను పరిశీలిస్తారని ప్రభుత్వం చెబుతోంది. ఉపాధి పథకం నిజంగానే దుర్వినియోగం అవుతోందన్న విమర్శలు ఉన్నాయి. ఉత్తుత్తి పనులకు కోట్లు వెచ్చించడం మంచిది కాదు. నిర్మాణాత్మక పనులు చేపడితే దేశ సంపద కూడా పెరుగు తుంది. కరోనా కాలంలో వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలకు నరేగా సంజీవనిగా మారింది. నగరాల్లో పనులు లేక, బతకలేక కాలినడకన బయల్దేరిన కష్టజీవికి స్వగ్రామంలో ఇంత కూడు పెట్టింది ఈ చట్టమే. ఆ పరిస్థితుల్లో 389 కోట్ల పనిదినాలను కల్పించింది. ఆ తరువాత ఏడాది కేంద్రం పని దినాలను 363 కోట్లకు తగ్గించేసింది. 2022-23 బడ్జెట్‌లో రూ.73 వేల కోట్లే కేటాయించారు. ఇది 2021-22 సవరించిన అంచనాల కంటే 25 శాతం తక్కువ. తాజాగా నియమించిన అమర్‌జిత్ సిన్హా నేతృత్వంలోని కమిటీకి ఇచ్చిన మార్గ దర్శకాలను బట్టి చూస్తే ఈ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నాలే కనిపిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. ఈ కమిటీ జనవరి నాటికి నివేదిక ఇస్తే, బడ్జెట్‌లో ఈ చట్టానికి కేటాయిస్తున్న నిధులకు మరింతగా కోత పెట్టాలని ప్రభుత్వం భావిస్తోందన్న ఆందోళన వఉంది. కేంద్రం లెక్కల ప్రకారమే దేశంలో 23 కోట్ల మంది పేదరికంలో మగ్గుతున్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు వ్యవసాయ కార్మికులు, పేదలతో పాటు పట్టణ పేదలు కూడా పనులు కల్పించి నిర్మాణాత్మక పనులు చేపడితే దేశ సంపద కూడా వృద్ధి చెందగలదు.

**పృధ్విరాజ్ గోసుకొండ**
ఎడిటర్

# తెలంగాణలో రైతు సంక్షేమానికి పెద్దపీట

- దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోంది
- ఉపాధి నిధులతో కల్లాలు నిర్మిస్తే తప్పెలా అవుతుంది
- నిబంధనలు మార్చాలన్న మంత్రి వేముల



నిజామాబాద్, డిసెంబర్ 26 (సమ సమాజం): తెలంగాణలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న విషయం దేశం మొత్తానికి తెలుసని, తెలియంది కేవలం మోడీ ప్రభుత్వానికేనని మంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. భారతదేశ చరిత్రలో రైతులకి నేరుగా డబ్బులు అందించే రైతుబంధు కార్యక్రమంతో మొదలుకొని రైతు బీమా, 24 గంటల వ్యవసాయ ఉచిత విద్యుత్ సరఫరా వంటి అనేక చారిత్రాత్మక పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ఉపాధి హామీని సాధ్యమైనంత ఎక్కువగా వినియోగించుకుంటున్న తమ ప్రభుత్వ సదుద్దేశానికి మోడీ ప్రభుత్వం దురుద్దేశాలు ఆపాది స్తోందని ఆయన విమర్శించారు. ఞాష్ట్ర వ్యవసాయ ప్రగతిపైన ఉన్న గుడ్డి వ్యతిరేకతతో కేంద్రం కక్ష కట్టిందని మంత్రి విమర్శించారు. వ్యవసాయరంగ అనుబంధ పనులకు ఉపాధి హామీ నిధులను ఖర్చు చేయవచ్చన్న నిబంధన ఉన్నా కేవలం తెలంగాణ రాష్ట్ర రైతులపై కక్ష సాధించేందుకు మాత్రమే నిధులు మళ్లింపు అంటూ మోడీ సర్కారు దుష్ప్రచారం చేస్తున్నదని ఆరోపించారు. రైతుల కోసం బావుల కాడ వడ్లు ఆరబెట్టుకోడానికి తెలంగాణ ప్రభుత్వం కల్లాలు నిర్మించాలని అనుకోవడం నేరమెలా అవుతుందని అన్నారు. అది తప్పని చెప్పగలరా అని ప్రశ్నించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని ఒత్తిడి చేసిన బిజెపి ప్రభుత్వం, అందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదని మరో కుట్రకు తెర లేపిందన్ననారు. రాష్ట్ర ప్రభుత్వం కల్లాలు నిర్మిస్తే ఆ నిధులు వెనక్కి ఇవ్వమని అడగడం సిగ్గుచేటని విమర్శించారు. ఇదేనా రైతుల మీద బిజెపి ప్రభుత్వానికి ఉన్న ప్రేమ అని ప్రశ్నించారు. కేంద్రం తీరుకు నిరసనగా బిఆర్ఎస్ తలపెట్టిన నేటి ధర్నా కార్యక్రమం బిజెపి కళ్లు తెరిపించాలని అన్నారు. తెలంగాణ రైతులు స్వచ్ఛందంగా ధర్నాల్లో పాల్గొని కేంద్ర విధానాలను నిరసించారని అన్నారు. ఇదిలావుంటే 2014 వరకూ గ్రామీణ ప్రాంత కుటుంబాల్లో 30 శాతం మందికి ఉపాధి లభించగా, మోడీ సర్కారు వచ్చిన తరువాత 2014 నుంచి 20 వరకూ చూస్తే 26 శాతం మందికే ఉపాధి కల్పించింది. ఉపాధి హామీ పనుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 18 శాతం మంది తిరస్కరణకు గురవుతున్నారని అధికారిక గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ తొలి అర్ధ సంవత్సరంలోనే కోటిన్నర మందికి ఉపాధిని కేంద్రం తిరస్కరించింది. దరఖాస్తు చేసుకున్న అందరికీ ఉపాధి కల్పించాలన్న చట్టం లక్ష్యానికి కేంద్రం మంగళం పాడింది. మరోవైపు ఏదో ఒక కొర్రీ పెడుతూ పథకం నిధుల చెల్లింపులో జాప్యం చేస్తూ ఉండటం షరామామూలుగా మారింది. ఉపాధి హామీ చట్టం ప్రకారం కార్మికుల మస్టరు రోల్స్‌లో నమోదు చేసిన 15 రోజుల్లో వేతనం చెల్లించాల్సి ఉంది. కేంద్రం సకాలంలో నిధులు చెల్లించకపోవడంతో, కూలీలకు నెలల తరబడి బకాయిలుంటున్నాయి. వీటన్నటింటిన సీక్షించి ఉపాధిని మరింత బలేపతం చేసి వ్యవసాయానికి అనుసంధానం చేయాలని మంత్రి వేముల డిమాండ్ చేశారు.

# టి తొలగింపుతో తెలంగాణకు అవమానం

**ఆంధ్రాలో కెసిఆర్ ప్రభావం ఉండకపోవచ్చు**
**చంద్రబాబును తెలంగాణలో కాలుపెట్టేల చేశారు**
**మీడియా సమావేశంలో ఎమ్మెల్యే జగ్గారెడ్డి**



హైదరాబాద్, డిసెంబర్ 26 (సమ సమాజం): సీఎం కేసీఆర్ పార్టీ పేరు నుంచి 'టి' తొలగించి తెలంగాణను అవమానించారని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ తో తెలంగాణ సెంటిమెంట్ ను కేసీఆర్ చంపేశారని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆరోపించారు. ఏపీలో బీఆర్ఎస్ ప్రభావం ఉండదని.. అలాగే చంద్రబాబు ఎఫెక్ట్ కూడా తెలంగాణ రాష్ట్రంలో ఉంటుందని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ ఏపీకి వెళుతున్నారు కాబట్టి చంద్రబాబు తెలంగాణకు వచ్చారని, సైలెంట్‌గా ఉన్న బాబును తెలంగాణకు రావడానికి కేసీఆరే అవకాశం ఇచ్చారన్నారు. కేసీఆర్ ఏపీలో అట్రాక్ట్ చేయలేరు.. కానీ బాబు తెలంగాణను అట్రాక్ట్ చేయగలరని అన్నారు. పార్టీ పేరు నుంచి తెలంగాణ తొలగించడంతోనే కేసీఆర్ బలం పోయిందని, సీఎంలో ఎక్కడో ఓ మూలన సమైక్య భావన ఉందన్నారు. తెలంగాణ వాదాన్ని ముఖ్యమంత్రి చంపేశారని, రాజకీయ బ్రతుకునిచ్చిన చెట్టునే కేసీఆర్ నరికేశారన్నారు. చంద్రబాబు ఇక కేసీఆర్‌తో ఆడుకుంటారని, కూటములు, పొత్తులపై ముందు ముందు తెలుస్తుందని, తెలంగాణలో ఇక సీరియస్ పాలిటిక్స్ నడుస్తాయని జగ్గారెడ్డి అన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకకు బిఆర్ఎస్ వెళితే టీడీపీ కూడా వెళుతుందన్నారు. బిఆర్ఎస్‌తో కేసీఆర్ సక్సస్ అయ్యే పరిస్థితి ఉండదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చాక మైనార్టీ లోన్స్ ఇవ్వడం లేదని, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో వంద శాతం సబ్సిడీతో చిరు వ్యాపారులకు లోన్స్ ఇచ్చామన్నారు. ఇటీవల ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్‌కు రూ. 120 కోట్లు కేటాయించిందని, ఆ డబ్బు ఏ మాత్రం సరిపోదని, కేవలం 1200 మందికి మాత్రమే సరిపోతాయన్నారు. మైనార్టీ కార్పొరేషన్‌కు కనీసం రూ. 1500 కోట్లు కేటాయించాలన్నారు. అప్లికేషన్ గడువును జనవరి 5వ తేదీ వరకే విధించారని.. మైనార్టీ కార్పొరేషన్ లోన్ దరఖాస్తు గడువును పెంచాలని జగ్గారెడ్డి కోరారు.

# 2న భద్రాచలంలో రాష్ట్రపతి ముర్ము పర్యటన

## భారీగా భద్రతా ఏర్పాట్లు చేసిన అధికారులు

భద్రాద్రికొత్తగూడెం, డిసెంబర్ 26 (సమ సమాజం): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 28వ తేదీన భద్రాచలంలో పర్యటించనున్నారు. ఆమె రాక సందర్భంగా భారీ ఏర్పాట్లు చేశారు. ముర్ము పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి కేంద్రీకరించింది. బూర్గంపాడు మండలం సారపాక ఐటీసీ బీపీఎల్ పాఠశాల ప్రాంగణంలోని మూడు హెలీప్యాడ్‌లను సిద్ధం చేసారు. రాష్ట్రపతి రాకను పురస్కరించు కొని ఇప్పటికే భద్రాచలం, సారపాకల్లో సాయుధ పోలీసుల తనిఖీలు, గస్తీలు భారీగా పెరిగాయి. రామాల యం చుట్టూ సాయుధ పోలీసు బలగాలను ఇప్పటికే మోహరించారు. రాష్ట్రపతి పర్యటన సమయంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషనరెడ్డి ఆమె వెంట రానుండగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి రానున్నట్లు దేవస్థానం అధికార వర్గాలకు సమాచారం అందినట్లు తెలిసింది. కాగా రాష్ట్రపతి భద్రాచలంలో రామాలయం దర్శనం అనంతర కార్యక్రమాల తరువాత ఆదివాసీలతో సుమారు 40 నిమిషాలపాటు జరిగే ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొననున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. సారపాక, భద్రాచలంలో లాడ్జీలు అద్దెకివ్వద్దని, దుకాణాలను మూసివేయాలని అధికారులు సూచించారు. పర్యటన రోజున భద్రాచలం, సారపాకల్లో 144వ సెక్షనను విధించాలని, రెండు పట్టణాలను సర్వాంగ సుందరంగా అలంకరించాలని సంబంధిత తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసుల రూట్ మార్చ్ నిర్వహించారు. కాగా భద్రాచలంలోని రామాలయం పరిసరాల్లో రహదారిపైకి ఉన్న రేకుల షెడ్ల రేకులను సిబ్బంది తొలగించారు. రామాలయ ప్రాంగణంలో రాష్ట్రపతి కోసం ప్రత్యేకంగా రూపొందించిన గ్రీన్ రూములకు తుది మెరుగులు దిద్దారు. ప్రత్యేకంగా క్రిటికల్ కేర్ బాక్సును ఏర్పాటు చేసి ప్రత్యేక వైద్య నిపుణులను అందుబాటులో ఉంచారు. రామాలయాన్ని సందర్శిం చిన సమయంలో దేవస్థానంలో వైదిక పరిపాలన సిబ్బంది నిర్దేశిత సంఖ్యలోనే అనుమతించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఎవరెవరు ఏ ప్రాంతంలో విధులు నిర్వహిస్తారు అనేదానిపై వివరాలను దేవస్థానం అధికారుల నుంచి జిల్లా అధికారులు సేకరించారు. ఆలయ దర్శనం అనంతరం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.50 కోట్లతో ప్రసాద్ పథకం కింద చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్రపతి ముర్ము శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్రపతి పర్యనట సందర్భంగా ఏర్పాట్లు ఘనంగా ఉండాలని భద్రాద్రి కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. ఈనెల 28వ తేదీన రాష్ట్రపతి భద్రాచలం పర్యటన పురస్కరించుకుని విధులు కేటాయించిన జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. మహబూబాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల ప్రారంభోత్సవాలు వర్చువల్ విధానం ద్వారా రాష్ట్రపతి ప్రారంభిస్తారని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులో ఉంచాలని బీఎస్ఎనఎల్ అధికారులను ఆదేశించారు. విద్యుత సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయంగా జనరేటర్ సిద్ధంగా ఉంచాలని విద్యుత శాఖ అధికారులను ఆదేశించారు.

# శ్రీశైలం చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



ఘనంగా స్వాగతం పలికిన మంత్రులు, అధికారులు● భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు

శ్రీశైలం, డిసెంబర్ 26 (సమ సమాజం): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శ్రీశైలం చేరుకున్నారు. సున్నిపెంటలోని హెలిపాడ్ వద్ద రాష్ట్రపతికి ఏపీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఘనంగా స్వాగతం పలికారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం శ్రీశైలంలో ప్రసాద్ పథకం ప్రాజెక్టులను ప్రారంభించారు. తర్వాత శివాజీ స్మారక కేంద్రాన్ని సందర్శించారు. సాయంత్రం 4.15 గంటలకు శ్రీశైలం నుంచి హైదరాబాద్‌లోని హకీంపేటకు చేరుకుంటారు. భ్రమరాంబ గెస్ట్‌హౌస్ నుంచి మల్లికార్జున స్వామి భ్రమరాంబ దేవి దర్శనార్థం శ్రీశైలం క్షేత్రానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఏపీ టూరిజం శాఖ మంత్రి రోజా స్వాగతం పలికారు. ఐదు రోజుల శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉదయం 10.45 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్రపతికి గవర్నర్ తమిళిసై, రాష్ట్రమంత్రి సత్యవతిరాథోడ్ స్వాగతం పలికారు. అనంతరం హెలికాప్టర్‌లో శ్రీశైలం బయల్దేరారు. అధికారులు, మంత్రులు తోడురాగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శ్రీశైలం మల్లన్న స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలోకి ప్రవేశించిన ముర్ము.. ముందుగా రత్న గర్భ గణపతిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మల్లికా గుండంలో ప్రతిబింబించే ఆలయ విమాన గోపురాన్ని దర్శించుకున్నారు. భ్రమరాంబ దేవికి కుంకుమార్చన చేశారు. అనంతరం ఆలయ అర్చకులు రాష్ట్రపతికి వేదాశీర్వచనం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీశైలంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనకు ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేశామని నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సామూన్ చెప్పారు. జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# బైజూస్ ఒప్పందంపై సర్వత్రా విమర్శలు

**ట్యాబ్‌ల కొనుగోళ్లపైనా అనుమానాలు**
**కంపెనీకి లబ్ది చేకూర్చే పథకమంటూ ఆరోపణలు**



అమరావతి, డిసెంబర్ 26 (సమ సమాజం): విద్యార్థులకు ఉచిత విద్య, ఇంగ్‌ఈలష్ మీడియం చదువుల అని చెబుతున్న ప్రభుత్వం ఇటీవలే ట్యాబ్‌లను కూడా పంపిణీచేసింది. ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విప్లవం తెస్తామని, వాటి ఫలితాలను రాష్ట్రంలోని పేద కుటుంబాలు వచ్చే పదేళ్లలో అనుభవిస్తాయని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెబుతున్నారు. అయితే దీనిపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. బైజూస్ అనే కంపెనీకి ప్రభుత్వం దోచి పెడుతోందని అంటున్నారు. సిపిఎం నేత మధు దీనిపై ఘాటుగానే స్పందించారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు, బోధిస్తున్న టీచర్లకు మొత్తంగా 5,18,740 ట్యాబుల పంపిణీకిఇటీవలే సిఎం జగన్ శ్రీకారం చుట్టారు. బైజూస్ ప్రీ లోడెడ్ కంటెంట్‌తో అందించనున్న ఈ ట్యాబుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,466 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. పిల్లలకు మరింత సులువుగా పాఠాలు అర్థమయ్యేందుకు వీలుగా ట్యాబులు అందిస్తున్నామని చెప్పారు. అసలు బైజూస్ కంటెంట్ వల్ల అటువంటి బహుళ ప్రయోజనం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం కానీ, లేక సిబిఎస్ఇ లేదా ఇంకేదైనా శాస్త్రీయ అధ్యయనం చేసే సంస్థగానీ నిర్ధారించిన దాఖలాలేవ్వు. కంటెంట్ విషయంలో ఎవరితోనైనా సంప్రదించివుంటే ఆ విషయాన్నైనా బయటపెట్టాలి కానీ సర్కారు అదీ చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వమే ఏకపక్షంగా బైజూస్ కంపెనీని ఎంపిక చేసుకొని, వందల కోట్ల రూపాయలు దానికి కుమ్మరించిందని సిపిఎం నేత మధు విమర్శించారు. ఈ నేపథ్యంలోనే దివాళా తీసిన సంస్థకు సిఎం మార్కెటింగ్ మేనేజర్‌లాగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ విద్యపై బైజూస్ పెత్తనాన్ని అంగీకరించడం ప్రమాదకరం అని కూడా అంటున్నారు. ట్యాబుల కొనుగోలు సందర్భం గా నిర్ణయించిన ప్రమాణాల విషయంలోనూ వస్తున్న ఆరోపణలతో కొన్ని సందేహాలు తలెత్తుతున్నాయి. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, కొన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలూ కొనుగోలు చేసే ట్యాబులకు ఎనిమిది అంగుళా ల సైజుకు పైబడాలన్న నిబంధన అమలు చేస్తుండగా ఆంధప్రదేశ్ ప్రభుత్వం దాన్ని 8.7 అంగుళాలుగా నిర్ణయించడం మూలంగా ఒక్క కంపెనీకి మాత్రమే అర్హత కలిగించిందన్న అంశం కూడా విమర్శలు వస్తున్నాయి. టెండర్ విషయంలో లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ లేదని ఇతర కంపెనీలు లబోదిబోమంటున్నాయి. బైజూస్ కంపెనీ అనైతిక వ్యవహారాలు ప్రస్తుతం ఎన్‌సిపిసిఆర్ విచారణ పరిధికి వెళ్లాయి. ట్యాబుల్లో ప్రీలోడ్ చేసిన కంటెంట్ నాణ్యత ఎక్కడా నిగ్గు తేలలేదు. వాటితోబాటు ట్యాబుల కొనుగోలు విషయంలోనూ అనుమానాలు రేకెత్తాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పథకం అమలును నిలుపు చేయాలన్న డిమాండ్లు వస్తున్నాయి. ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విప్లవం తెస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబుల్లో లోడ్ చేసిన స్టడీ మెటీరియల్ నాణ్యత, వాటి కొనుగోలు వ్యవహారం, బైజూస్ కంపెనీ అనుసరించిన తప్పుడు పద్ధతులపై వస్తున్న మీడియా కథనాలు పలు సందేహాలకు తావిస్తున్నాయి. పిల్లలు, వారి తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లను అక్రమంగా కొనుగోలు చేసి, తల్లిదండ్రులను బైజూస్ బెదిరిస్తోందని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒత్తిడి చేసి కోర్సులను కొనుగోలు చేయించడం, నిబంధనలకు విరుద్ధంగా ఫోన్ నెంబర్లను సంపాదించడం లాంటి అతిక్రమణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. బైజూస్ సంస్థ రుణ ప్రాతిపదికన సైతం తల్లిదండ్రులతో ఒప్పందాలు చేసుకుంటోందని, ఎవరైనా తిరిగి తమ మొత్తాన్ని ఇవ్వాలని, ఈ ఒప్పందం నుంచి వెనక్కు వెళ్లిపోతామని కోరినా అంగీకరించకుండా వేధింపులకు గురిచేస్తోందని తెలిపారు. తాము దోపిడీకి గురయ్యామని, మోసపోయామని పలువురు తల్లిదండ్రులు కమిషన్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఇటువంటి కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం విస్తుగొలుపుతోంది.

# ఫామ్‌హౌజ్ కేసులో కీలక మలుపు

## నమ్మకం లేదని నిందితులు హైకోర్టును ఆశ్రయించారు.



(మొదటి పేజి తరువాయి) సీబీఐ లేదా ఇండిపెండెంట్ దర్యాప్తు సంస్థ ద్వారా ఎంక్వైరీ చేయాలని అభ్యర్థించింది. దర్యాప్తు వివరాల లీకులపై పిటిషనర్లు మొదటి నుంచి అభ్యంతరం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. సీఎం కేసీఆర్ సైతం ఆధారాలను లీక్ చేసిన విషయాన్ని న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. పిటిషనర్ల తరపున మహేశ్ జఠ్మలానీ, సిట్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్ దుష్యంత్ దవే వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం పిటిషనర్ల వాదనలతో ఏకీభవించింది. సిట్‌ను క్వాష్ చేయడంతో పాటు కేసును సీబీఐకి అప్పగించాలంటూ తీర్పు వెలువరించింది. మరోవైపు ఫాం హౌస్ కేసులో నిందితుడిగా ఉన్న నందకుమార్ ఈడీ విచారణ కొనసాగుతోంది. ఈడీ అధికారులు చంచల్ గూడ జైలులోనే ఆయన స్టేట్ మెంట్ రికార్డు చేస్తున్నారు. లంచ్‌కు ముందు వరకు నందకుమార్ వ్యక్తిగత వివరాలను మాత్రమే రికార్డు చేశారు. ఆయన వ్యాపారాలు, పరిచయాలపై ఆరా తీశారు. నందకుమార్ పార్ట్‌నర్‌గా ఉన్న రోహిత్ రెడ్డి కుటుంబసభ్యులకు సంబంధించిన వివరాలను సైతం ఈడీ రికార్డు చేసింది. అభిషేక్ ఆవుల ద్వారా పరిచయమైన వ్యక్తుల వివరాలు, ఆర్థిక వ్యవహారాలపైనా అధికారులు సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. జైలర్ రూంలో నంద స్టేట్ మెంట్ ను అధికారులు రికార్డు చేసారు. లంచ్‌కు ముందు గంటసేపు ప్రశ్నించిన ఈడీ.. 45 నిమిషాల భోజన విరామం అనంతరం మళ్లీ విచారణ ప్రారంభించారు. సాయంత్రం ఐదింటి వరకు ఈడీ విచారణ కొనసాగనుంది. కరోనా కేసులు పెరుగుతున్నందున నంద కుమార్‌ను ఈడీ అధికారులు చంచల్ గూడ జైలులోనే ప్రశ్నిస్తున్నారు.

# శ్రద్ధావాకర్ దారుణ హత్యోదంతం కేసు

(మొదటి పేజి తరువాయి) ఆడియోలను ఢిల్లీ పోలీసులు పెద్ద సాక్ష్యంగా పరిగణిస్తున్నారు. హత్యకు గల కారణాలను తెలుసుకునేందుకు ఈ ఆడియో హత్యకు సంబంధించిన విచారణకు ఎంతగానో దోహదప డుతుందని, విచారణలో పాల్గొన్న అధికారులు చెబుతున్నారు. ఈ ఆడియోతో అఫ్తాబ్ వాయిస్‌తో మ్యాచ్ అయ్యేలా పోలీసులు అతని వాయిస్ శాంపిల్‌ను తీసుకుంటారు. సీబీఐ సీఎఫ్ఎస్ఎల్ బృందం అఫ్తాబ్ వాయిస్ శాంపిల్ తీసుకుంటుంది. శ్రద్ధ హత్య తర్వాత కూడా అఫ్తాబ్ అదే ఫ్లాట్‌లో నివసిస్తున్నాడు. అతను శ్రద్ధా సోషల్ మీడియా ఖాతాలను కూడా ఉపయోగిస్తూనే ఉన్నాడు, తద్వారా ఆమె హత్యపై ఎవరికీ అనుమానం రాలేదు. తన జీవిత భాగస్వామిగా ఉన్న శ్రద్ధను 2018లో డేటింగ్ యాప్ ద్వారా అఫ్తాబ్ పరిచయం చేసుకున్నాడు. ఈ ఏడాది మే 8న ఇద్దరూ ఢిల్లీ వచ్చారు. మే 18న శ్రద్ధను 35 ముక్కలుగా నరికి చంపిన అఫ్తాబ్ 18 రోజుల్లో ఆ విడిభాగాలను ఢిల్లీలోని వేర్వేరు ప్రాంతాల్లో విసిరేశాడు. ఈ కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు పలు కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. తాజాగా, ఈకేసుకు సంబంధించి ఆడియో రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. దొరికిన ఆడియోలను ఢిల్లీ పోలీసులు పెద్ద సాక్ష్యంగా పరిగణిస్తున్నారు. హత్యకు గల కారణాలను తెలుసుకోవడానికి ఈ ఆడియో ఎంతగానో దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు. అఫ్తాబ్ ఇప్పటికీ తీహార్ జైలులోనే ఉన్నాడు. సోమవారం ఉదయం 8 గంటలకు ఆయనను తీహార్ జైలు నుంచి సీబీఐ తీసుకెళ్లింది. శ్రద్ధా వాకర్ హత్య కేసులో నిందితుడు అఫ్తాబ్‌కు నార్కో టెస్ట్ నిర్వహించారు. అంతకుముందు అతనికి పాలిగ్రాఫ్ పరీక్ష కూడా చేశారు. పోలీసుల విచారణలో శ్రద్ధను హత్య చేసింది తానేనని అఫ్తాబ్ అంగీకరించాడు. అఫ్తాబ్ శ్రద్ధా ప్రేమికులు. ఇద్దరూ ముంబై వాసులు కాగా, కొద్ది రోజుల క్రితం ఢిల్లీకి మకాం మార్చారు. ఢిల్లీలోని మెహ్రౌలీలో ఎలాట్ తీసుకొని ఇద్దరూ లివ్ ఇన్ రిలేషన్షిప్‌లో జీవిస్తున్నారు. మే 18న శ్రద్ధాతో గొడవపడ్డాడని అఫ్తాబ్ చెప్పాడు. ఆ తర్వాత శ్రద్ధను గొంతుకోసి హత్య చేశాడు. ఆ తర్వాత అఫ్తాబ్ శ్రద్ధా శరీరాన్ని 35 ముక్కలుగా నరికేశాడు. అఫ్తాబ్ ఈ ముక్కలను ఫ్రిజ్‌లోనే దాచిపెట్టాడు. మెహ్రౌలీ అడవిలో శ్రద్ధా మృతదేహం ముక్కలను రోజుకొకటి చొప్పున రాత్రిపూట వెళ్లి అడవుల్లో విసిరేసేవాడు. శ్రద్ధ హత్య తర్వాత కూడా అఫ్తాబ్ అదే ఫ్లాట్‌లో నివసిస్తున్నాడు. అతను శ్రద్ధా సోషల్ మీడియా ఖాతాలను కూడా ఉపయోగిస్తూనే ఉన్నాడు, తద్వారా ఆమె హత్యపై ఎవరికీ అనుమానం రాలేదు. శ్రద్ధా ఖాతాల నుంచి అఫ్తాబ్ 54 వేల రూపాయలను బదిలీ చేశాడు. ఈక్రమంలోనే శ్రద్ధా తండ్రి ఇచ్చిన మిస్సింగ్ కేసు ఆధారంగా పోలీసులు.. శ్రద్ధా మొబైల్ లొకేషన్, బ్యాంకు ఖాతా వివరాల సాయంతో పోలీసులు అఫ్తాబ్‌ను చేరుకున్నారు. నవంబర్ 12న అఫ్తాబ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

# లిక్కర్ స్కామ్‌లో కవితను అరెస్ట్ చేయాలి



(మొదటి పేజి తరువాయి) ఫ్యామిలీపై అందరు కలిసికట్టుగా పోరాడాలన్నారు. ఐదారు నెలల్లోనే కేసీఆర్ ప్రభుత్వాన్ని రద్దు చేస్తాడన్నారు. కేసీఆర్ తన తోక చుట్టాలను మాత్రమే అభివృద్ధి చేస్తున్నాడని.. రాష్ట్రాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు నామినేటెడ్ పోస్టులొస్తాయని శోభ అన్నారు. హైదరాబాద్ పబ్బుల్లో విచ్చలవిడిగా డ్రగ్స్ సరాఫరా జరుగుతోందని ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై మహిళా మోర్చా ఉద్యమించాలని సూచించారు. మహిళా రిజర్వేషన్లను అడ్డుపెట్టుకుని పురుషులు.. భార్యనో, చె÷-లలెనో నిలబెట్టడాన్ని వ్యతిరేకించాలన్నారు. బీజేపీ కోసం ఫుల్ టైం పనిచేసిన మహిళలకే అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా మహిళలు ఎదగాలని శోభ పిలుపునిచ్చారు. చట్టసభల్లో 33 శాతమే మహిళలు ఉండటాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. మహిళలు అభ్యున్నతికి అంబేద్కర్, జ్యోతిరావ్ పూలే ఎంతో శ్రమించారని చెప్పారు. ఈ ఇద్దరు లేకుంటే మహిళలు ఇంటినుంచి బయటకు వచ్చేవారు కాదన్నారు.

# ఉపాధి నిధులు కాంట్రాక్టర్లకు మళ్లించారు

(మొదటి పేజి తరువాయి) జరిగాయన్నారు. అసెంబ్లీతో పోలిస్తే పార్లమెంట్ భేషజాలు లేకుండా అన్ని పార్టీల సభ్యులకు అవకాశం ఇచ్చారని ఆయన చెప్పారు. తెలంగాణలో కేంద్ర పథకాల పేరు మార్పు, నిధుల మళ్లింపు విషయాలను కూడా పార్లమెంట్‌లో ప్రస్తావించే అవకాశం వచ్చిందని తెలిపారు. అలాగే.. విద్యుత్ డిస్కం సమస్యలు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవ్వడం, భూములు అన్యాక్రాంతం కావడాన్ని ప్రస్తావించానన్నారు. ఆవాస్ యోజన పథకాల నిధుల మళ్లింపు అంశాన్ని కూడా లేవనెత్తానని చెప్పారు. అయితే.. తాను అడిగిన వాటిలో15 ప్రశ్నలకు లిఖితపూర్వకంగా సమాధానం వచ్చిందని ఎంపి లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఆయుష్మాన్ భారత్‌ను అమలు చెయ్యక పోవడంతో వేల కుటుంబాలు కరోనా సమయంలో నష్టపోయా యని చెప్పారు. యూపీలో 5 సంవత్సరాలలో ఆవాస్ యోజన కింద 50 లక్షల ఇండ్లు పూర్తయ్యాయని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. తెలంగాణలో డబుల్ బెడ్ రూమ్?లు ఎంత మందికి ఇచ్చారని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. కేంద్రం ఎస్సీ విద్యార్థులకు 250 కోట్ల స్కాలర్షిప్ ఇస్తే మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా కేసీఆర్ దళిత విద్యార్థులను మోసం చేశారన్నారు. రాంజీ గొండ్ మ్యూజియం కోసం 2018లో రూ.15 కోట్లు ఇస్తే ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు.

# కొనసాగుతున్న సెస్ ఎన్నికల కౌంటింగ్

(మొదటి పేజి తరువాయి) సేపటి వరకు అధికారులు ప్రకటించలేదు. దీంతో బీజేపీ ఆందోళనకు దిగింది. పోలీసులు స్వల్ప లాఠీఛార్జ్ చేశారు. ఈ క్రమంలో సెస్ ఫలితాల్లో గందరగోళం కొనసాగుతూ వచ్చింది. వేములవాడ రూరల్ బీజేపీ అభ్యర్థి గెలిచినట్లు మొదట ప్రకటించారు అధికారులు. అయితే మెజార్టీ 5 ఓట్లు మాత్రమే ఉండటంతో.. మళ్లీ రీ కౌంటింగ్ చేయాలని బిఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. బీజేపీ నేతలు కూడా ఆందోళన చేశారు. అధికారులు, పోలీసులు శిసబకు వత్తాసు పలుకుతున్నారని బీజేపీ లీడర్లు ఆరోపించారు. అధికారుల తీరుకు నిరసనగా బీజేపీ నేతలు కౌంటింగ్ కేంద్రం ముందు బైఠాయించారు. ఇదే టైంలో రెండు పార్టీల నేతలు గొడవకు దిగడంతో పోలీసులు స్వల్ప లాఠిచార్జి చేశారు. దీంతో అధికారులు దిగవచ్చి బీజేపీ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటించారు. గందరగోళం మధ్యే వేములవాడ రూరల్ అభ్యర్థిని ప్రకటించారు ఎన్నికల అధికారులు. బీజేపీ అభ్యర్థి జక్కుల తిరుపతి గెలిచినట్లు అధికారికంగా ప్రకటించారు. తిరుపతి గెలుపుతో బీజేపీ కార్యకర్తల సంబురాలు చేసుకుంటున్నారు. అయితే అంతకు ముందు కౌంటింగ్ కేంద్రం ముందు కేంద్రం దగ్గర ఃఖా, ఃఏఖ కార్యకర్తల గొడవకు దిగారు. దీంతో స్వల్ప లాఠిచార్జితో పోలీసులు చెదరగొట్టారు. బీజేపీ ఆందోళనతో ఎన్నికల అధికారులు దిగివచ్చారు. రాజన్న సిరిసిల్ల సెస్ ఎన్నికల్లో మరో ఫలితం వచ్చింది. బీఆర్ఎస్ అభ్యర్థిపై బీజేపీ అభ్యర్థి జక్కుల తిరుపతి విజయం సాధిం చారు. బీజేపీ అభ్యర్థికి 1379, బీఆర్ఎస్ అభ్యర్థికి 1372 ఓట్లు వచ్చాయి. ఏడు ఓట్ల తేడాతో విజయం సాధించారు బీజేపీ అభ్యర్థి జక్కుల తిరుపతి. అయితే దీనిపై బిఆర్ఎస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేసారు. రీ కౌంటింగ్ కోసం పట్టుబట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రుద్రంగిలో బీఆర్ఎస్ బలపరిచిన ఆకుల గంగారం అనే అభ్యర్థి 36 ఓట్లతో గెలిచారు. బీఆర్ఎస్ అభ్యర్థికి 523, స్వతంత్ర అభ్యర్థికి 487 ఓట్లు లభించాయి. ఈనెల 24వ తేదీన శనివారం సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం సెస్ ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. 15 డైరెక్టర్ పోస్టుల కోసం జరిగిన ఎన్నికల్లో గెలవడానికి ప్రధాన పార్టీలు అన్ని ప్రయత్నాలు చేశాయి. మొత్తం 15 డైరెక్టర్ స్థానాలకు ప్రధాన పార్టీలతో పాటు ఇండిపెండెంట్లు, రెబెల్స్ కలిపి 75 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. సెస్ ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకం గా తీసుకున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ తో సహా అన్ని పార్టీలు హోరాహోరీగా ప్రచారం చేశాయి. సెస్ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా రాజకీయ వేడి మామూలుగా ఉండదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కూడా సెస్ ఎన్నికలు అలాగే జరిగాయి. ఇటీవల రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన సెస్ ఎన్నికల్లోనూ అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య హోరాహోరీ పోరు కొనసాగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కావటంతోనే వేడి కొనసాగుతోంది. రెండు ప్రధాన శాసనసభ నియోజకవర్గాలతో పాటు ఇతర నియోజకవర్గాల్లో మరో రెండు మండలాల్లో నిర్వహించనున్న సెస్ ఎన్నికలు రాజకీయ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా నిలిచాయి. పార్టీలకు అతీతంగా ఈ ఎన్నికలు జరిగినా, ఆయా పార్టీల మద్దతుతోనే అభ్యర్థులు బరిలో నిలిచారన్న విషయం అందరికీ తెలిసిందే. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కీలకంగా ఉన్న సెస్ పరిధిలో 2.81 లక్షల సర్వీస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటి పరిధిలో బకాయిదారులు ఓటు హక్కు కోల్పోగా 87130 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఎస్సీ, ఎస్టీలకు నామినేషన్ రుసుము రూ.వెయ్యి, బీసీలకు రూ.2 వేలు, ఇతరులకు రూ 4 వేలుగా నిర్ణయించారు. ససహకార చట్టం ప్రకారమే ఎన్నికల నిబంధనలకు లోబడి ఏర్పాట్లు చేశారు.సెస్ ఎన్నికల్లో డైరెక్టర్ స్థానాలకు పోటీ చేసే వారు వారికి ముగ్గురు పిల్లలు ఉంటే అనర్హులు. ఎన్నికలు పార్టీలకు అతీతంగా నిర్వహిస్తుండడంతో ఎన్నికల కోడ్, వ్యయ నియంత్రణ ఉండదు. సెస్ ఫలితాల్లో గందరగోళం కొనసాగుతోంది. వేములవాడ రూరల్ బీజేపీ అభ్యర్థి గెలిచినట్లు అధికారులు మొదట ప్రకటించారు. అయితే మెజార్టీ 5 ఓట్లు మాత్రమే ఉండటంతో.. మళ్లీ రీ కౌంటింగ్ చేయాలని బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. ఇదే టైంలో బీజేపీ నేతలు కూడా ఆందోళన చేశారు. అధికారులు, పోలీసులు బీఆర్ఎస్ కు వత్తాసు పలుకుతున్నారని బీజేపీ లీడర్లు ఆరోపించారు. అధికారుల తీరుకు నిరసనగా బీజేపీ నేతలు కౌంటింగ్ కేంద్రం ముందు బైఠాయించారు. ఇదే టైంలో రెండు పార్టీల నేతలు గొడవకు దిగడంతో పోలీసులు స్వల్ప లాఠిచార్జి చేశారు. దీంతో అధికారులు దిగివచ్చి బీజేపీ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటించారు. గందరగోళం మధ్యే వేములవాడ రూరల్ అభ్యర్థిని ప్రకటించారు ఎన్నికల అధికారులు. బీజేపీ అభ్యర్థి జక్కుల తిరుపతి గెలిచినట్లు అధికారికంగా ప్రకటించారు. తిరుపతి గెలుపుతో బీజేపీ కార్యకర్తల సంబురాలు చేసుకుంటున్నారు.

# హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ముర్ము



(మొదటి పేజి తరువాయి) అందించి స్వాగతం పలికారు. రాష్ట్రపతి ముర్ముకు స్వాగతం పలికిన వారిలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, సీఎస్ సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డితో పాటు ఆర్మీ, నేవీ అధికారులు ఉన్నారు. అనంతరం భారత సైనికుల గౌరవ వందనాన్ని ద్రౌపది ముర్ము స్వీకరించారు. శీతకాల విడిది కోసం ముర్ము ఇవాళ హైదరాబాద్‌కు వచ్చారు. 5 రోజుల పాటు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ముర్ము బస చేయనున్నారు. ఈ పర్యటన నేపథ్యంలో ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాష్ట్రపతి.. ప్రత్యేక హెలికాప్టర్‌లో శ్రీశైలం వెళ్లారు. అ క్కడ మల్లికార్జున స్వామిని దర్శించుకున్న అనంతరం హకీంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. తెలంగాణలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది పర్యటన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ,గవర్నర్ తమిళిసై మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని వికసించేలా చేసింది. కొంత కాలంగా ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేసీఆర్, తమిళిసై చాలా రోజుల తర్వాత రాష్ట్రపతి పర్యటన పుణ్యాన ఒకరితో ఒకరు మాట్లాడుకున్నారు. గవర్నర్ తమిళిసైతో ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు కలిపారు. ఆ తర్వాత రాష్ట్రపతితో ప్రముఖుల పరిచయ కార్యక్రమంలో కూడా తమిళిసై, కేసీఆర్ ఒకే వేదికపై కనిపించారు. అయితే.. రాష్ట్రపతికి కలిసి స్వాగతం పలికి మాటామంతీ కలిపి కేసీఆర్, తమిళిసై సఖ్యతతో ఉన్నట్లు కనిపించినప్పటికీ రాజ్‌భవన్‌లో రాష్ట్రపతికి గవర్నర్ ఇస్తున్న విందుకు మాత్రం కేసీఆర్ దూరంగా ఉంటున్నట్లు తెలిసింది. ఇప్పటివరకు సీఎం షెడ్యూల్‌లో గవర్నర్ విందు కార్యక్రమం లేకపోవడం, హకీంపేట్ నుంచి ఫామ్‌హౌస్‌కు సీఎం కేసీఆర్ నేరుగా బయల్దేరి వెళ్లడంతో ఆయన గవర్నర్ ఇస్తున్న విందుకు హాజరు కాకపోవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, గవర్నర్ తమిళిసైకి కొంత కాలంగా ఎడ తెగని పంచాయితీ నడుస్తోంది. ప్రభుత్వానికి, రాజ్‌భవన్‌కు మధ్య వివాదం రాజుకుంది. ప్రతిసారి గణతంత్ర వేడుకలను పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహిస్తారు. కానీ.. ఒమైక్రాన్ కేసుల కారణంగా ఈ ఏడాది జనవరి 26న ఉత్సవాలను పరిమిత సంఖ్యలో రాజ్‌భవన్‌లోనే నిర్వహించాలంటూ ప్రభుత్వం నుంచి షెడ్యూలు వెలువడింది. ఇది ఉద్దేశపూర్వకంగానే జరిగిందన్న అభిప్రాయాలు అప్పట్లో వెలువడ్డాయి. సీఎం కేసీఆర్, ఇతర మంత్రులు ఎవరూ గణతంత్ర వేడుకలకు హాజరు కాకపోవడం చర్చనీ యాంశమైంది. ఆ తర్వాత ఎంఐఎం సభ్యుడు జాఫ్రీని శాసన మండలి ప్రొటెం చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. దీని గురించి గవర్నర్ ప్రభుత్వాన్ని వివరణ అడిగారు. గవర్నర్ తమిళిసై మేడారం జాతరకు వెళ్లిన సందర్భంలోనూ ప్రొటోకాల్ నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వం పాటించకపోవడమూ చర్చనీయాంశమైంది. ఇలా ఇరు వర్గాల మధ్య రోజుకో వివాదం చోటు చేసుకుంటుండడంతో సీఎంవో, రాజ్‌భవన్ మధ్య దూరం క్రమేపీ పెరుగుతూ వచ్చింది. గవర్నర్ తమిళిసై కూడా బాహాటంగానే ముఖ్యమంత్రి కేసీఆర్ తీరును తప్పుబట్టిన సందర్భాలున్నాయి. గవర్నర్‌ను నిమిత్తమాత్రురాలిగా చేయడానికి సీఎంవో ప్రయత్నిస్తోందన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపించాయి. రాజకీయ వర్గాల్లో కూడా ఇదే చర్చ జరిగింది. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీఆర్ఎస్ పార్టీల మధ్య ముదిరిన వివాదం కారణంగా ఆమెను పక్కన పెట్టే ప్రయత్నాలు అధికార టీఆర్ఎస్ ముమ్మరం చేసిందని వాదన తెరపైకొచ్చింది. అయితే, రాజకీయ పార్టీల మధ్య ఉన్న పొరపొచ్చాలు, వివాదాలకు వ్యవస్థలను బలి చేయవద్దని, రాజ్యాంగపరమైన పదవులకు విలువ ఇవ్వాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ... ప్రభుత్వం ఇలాంటి అభిప్రాయాలు, విమర్శలను ఏమాత్రం లెక్క చేయకపోవడంతో ఒకానొక దశలో గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్య వివాదం ముదిరి పాకాన పడింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది మూలాన అంటీముట్టనట్టు ఉన్న ఈ ఇద్దరూ మళ్లీ ముచ్చటించుకునేంత కాకపోయినా సఖ్యంగా పలకరించుకున్న పరిస్థితి కనిపించింది. ఇదిలా ఉండగా.. సీఎం కేసీఆర్‌తో పాటు రాష్ట్రపతి ముర్ముకు ఎమ్మెల్యేలు రోహిత్‌రెడ్డి, రేగా కాంతారావు, బాలరాజ్, హర్షవర్ధన్‌రెడ్డి స్వాగతం పలకడం కొసమెరుపు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ఈ నలుగురే కావడం గమనార్హం. వ్యూహాత్మకంగానే ఈ ఎమ్మెల్యేలను కేసీఆర్ వెంటబెట్టుకుని వెళ్లి ఉండొచ్చనే చర్చ మొదలైంది. మొత్తంగా చూసుకుంటే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్య ఉన్న గ్యాప్‌ను కాస్త తగ్గించినట్టే కనిపిస్తోంది. అయితే షెడ్యూల్‌లో లేదనే కారణంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ విందుకు సీఎం కేసీఆర్ వెళ్లకపోవడం గవర్నర్‌తో ఆ గ్యాప్ కొనసాగుతుందనే సంకేతాలకు కారణమైంది.

## కేంద్ర బలగాల ఆధీనంలోకి రామప్ప ఆలయం

ములుగు, డిసెంబర్ 26 (సమ సమాజం): జిల్లాలోని రామప్ప ఆలయాన్ని కేంద్ర బలగాలు ఆధీనంలోకి తీసుకున్నాయి. ఈనెల 28న వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్పను రాష్ట్రపతి ద్రౌపదీముర్ము సందర్శించనున్నారు. రాష్ట్రపతి పర్యటన కోసం అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. దీంతో రామప్ప ఆలయాన్ని కేంద్ర బలగాలు ఆధీనంలోకి తీసుకున్నాయి. రక్షణ రంగానికి చెందిన హెలికాప్టర్లతో ట్రైల్ రన్ నిర్వహించారు. 27, 28 తేదీల్లో రామప్పకు సందర్శకులను నిలిపివేస్తూ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి రాకతో ములుగు జిల్లా యంత్రాంగం భారీగా ఏర్పాట్లు చేస్తోంది.

# అధికారుల ముందే పప్పులో పురుగుల పట్టివేత

(మొదటి పేజి తరువాయి) తమ సమక్షంలోనే వంటలు చేసినా పురుగులు రావడంతో డీఈఓ, సెక్టోరియల్ అధికారులు స్పందించి హాస్టల్ కి 3రోజులు సెలవు ప్రకటించాలని నిర్ణయించారు. ఆదివారం ఫుడ్ పాయిజన్ కావడంతో 25 మంది విద్యార్థులను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా స్పందించారు. వాస్తవాలు తెలుసుకునేందుకు సెక్టోరియల్ ఆఫీసర్లు తనిఖీలు చేపట్టగా జిల్లా విద్యాశాఖ అధికారి కూడా హాస్టల్ కు వచ్చి విచారణ జరిపారు. అస్వస్థతకు గురై హాస్టల్ లోనే చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు.

# అమెరికాలో మంచు తుఫాన్ బీభత్సం

## క్రిస్మస్ వేడుకలు తీవ్ర అంతరాయం

### దేశవ్యాప్తంగా 31 మంది మరణించారని అంచనా



న్యూయార్క్, డిసెంబర్ 26 (సమ సమాజం): క్రిస్మస్ పండుగ పూట అగ్రరాజ్యం అమెరికాను మంచు తుఫాను ముంచెత్తింది. ఆర్కిటిక్ పేలుడు సంభవించడటంతో 48 రాష్ట్రాలు చలిగుప్పిట్లో చిక్కుకున్నాయి. తూర్పు అమెరికాలో పరిస్థితి మరింత భయంకరంగా మారిపోయింది. భారీ మంచు తుఫాను వల్ల న్యూయర్క్ ఒక వార్ జోన్‌ను తలపిస్తున్నది. గుట్టలు గుట్టలుగా మంచు పేరుకుపోవడంతో జనజీవనం ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. విపరీతమైన చల్లని గాలులు వీస్తుండటంతో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 31 మంది మృతిచెందారు. పెనుగాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో 20 లక్షల మందికి పైగా అంధకారంలో చిక్కుకున్నారు. న్యూయార్క్‌లో పరిస్థితి యుద్ధ క్షేత్రాన్ని తలపిస్తున్నదని గవర్నర్ క్యాథీ హోచుల్ అన్నారు. రోడ్లపై మంచు పేరుకుపోవడంతో వాహనాలు వెళ్లడానికి వీల్లేకుండా పోయిందని చెప్పారు. ఇక బఫెలో లోని కొన్ని ప్రాంతాలలో 2.4 అడుగుల మేర మంచు కురిసిందని, విద్యుత్ లేకపోవడంతో ప్రజలు ప్రమాదంలో చిక్కుకుపోయారని అధికారులు వెల్లడించారు. తుఫాను పరిస్థితుల్లో ప్రజలందరూ ఇళ్లల్లోనే ఉండాలని అధికారులు కోరారు. విద్యుదుత్పత్తి కేంద్రాల సామర్థ్యం పడిపోవడంతో, పలు నివాసాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సుమారు 60 శాతం మంది మంచు తుపానుతో విలవిల్లాడుతున్నారు. సుమారు ఏడు లక్షల మంది కంటే ఎక్కువ మంది అమెరికన్లు క్రిస్మస్ వేడుకల సమయంలోనూ విద్యుత్ కోతలకు గురయ్యారని రాయిటర్స్ నివేదిక తెలిపింది. భారీ శీతల గాలులు, హిమపాతం, కారు ప్రమాదాల కారణంగా సుమారు 18 మంది మరణించినట్లు పేర్కొంది. మంచు తుపాను, క్రిస్మస్ సెలవుల కారణంగా అనేకమంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారని తెలిపింది. శనివారం 2,700 కంటే ఎక్కువ విమానాలు రద్దయ్యాయని, 6,400 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని పేర్కొంది. న్యూఇంగ్లాండ్ ప్రాంతంలో అత్యధికంగా విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడిందని, 2,81,651 మంది ప్రభావితమయ్యారని సిఎన్ఎన్ పేర్కొంది. ఆదివారం నాటికి పశ్చిమ న్యూయార్క్‌లో విద్యుత్‌ను పునరుద్ధరించగలిగామని రాష్ట్ర గవర్నర్ కాథీ హోచుల్ తెలిపారు. మంచు తుపాను ఇంకా ముగియలేదని ఆయన ట్వీట్ చేశారు. ప్రజలు నివాసాల్లోనే ఉండాలని, ప్రయాణాలు చేయవద్దని సూచించారు. న్యూయార్క్‌లోని బఫా ప్రాంతంలో గంటకు 96 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయని మీడియా తెలిపింది. విజిబిలిటీ సున్నాకి దగ్గరగా ఉందని పేర్కొంది.

# శ్రీలంకతో వచ్చేనెలలో టీ ట్వంటీ..వన్డే సీరిస్

## మ్యాచ్‌లకు దూరం కానున్న రోహిత్, కెఎల్ రాహుల్



ముంబయి, డిసెంబర్ 26 (సమ సమాజం): ఇప్పటికే గాయంతో బంగ్లా సీరిస్‌కు దూరమైన రోహిత్ శర్మ శ్రీలంకతో జరిగే మ్యాచ్‌లకు కూడా దూరం అయ్యే అవకాశం ఉంది. జనవరిలో శ్రీలంకతో జరగనున్న టీ20, వన్డే సిరీస్ లకు కెప్టెన్ రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్ దూరమయ్యే చాన్స్ ఉంది. బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ లో గాయపడ్డ రోహిత్ శర్మ ఇంకా కోలుకోలేదు. దీంతో రోహిత్ శ్రీలంకతో సిరీస్ లకు అందుబాటులో ఉండడని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఇక కేఎల్ రాహుల్ పెళ్లి చేసుకోబోతున్న కారణంగా సిరీస్‌లకు దూరం కానున్నాడు. రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్ దూరం అయితే టీ20లకు హార్ధిక్ పాండ్యా.. వన్డేలకు శిఖర్ ధావన్ కెప్టెన్సీ తీసుకోనున్నారు. రోహిత్, రాహుల్ ఎంపికపై ఇంకా బీసీసీఐ అధికారిక ప్రకటన చేయలేదు. మూడు టీ20లు, మూడు వన్డేల కోసం శ్రీలంక జనవరి 3 నుంచి జనవరి 15 వరకు భారత్‌లో పర్యటించనుంది. మరో వైపు కెప్టెన్ రోహిత్, కేఎల్ రాహుల్ ల ఫామ్ గురించి కూడా ఆందోళనగా ఉంది. ఈ సంవత్సరంలో వీళ్లు పెద్దగా రాణించడం లేదు. ఈ సంవత్సరం 29 టీ20ల్లో 656 పరుగులు చేశాడు రోహిత్ శర్మ.ఇందులో మూడు హాఫ్ సెంచరీలు ఉండగా.. అత్యధిక స్కోరు 72. ఇక ఆసియా కప్ తర్వాత టీ20ల్లో రాహుల్ పనితీరు ఆశించిన విధంగా లేదు. 16 ఇన్నింగ్స్‌లకు గాను అతడు కేవలం ఆరు అర్ధ సెంచరీలు చేశాడు. మిగిలిన 10 ఇన్నింగ్స్ లలో అతడు ఒక అంకె స్కోరుకే వెనుదిరిగాడు. ఈ సిరీస్‌కు బిసిసిఐ ఇంకా జట్టును ప్రకటించని కారణంగా ఏ విషయం త్వరలో తేలిపోనుంది. ఇరుజట్ల మధ్య జనవరి మూడు టి20 సిరీస్, 10నుంచి వన్డేలు సిరీస్‌లు జరగనున్నాయి. షెడ్యూల్.. ఇలావుంది. టి20 సిరీస్.. జనవరి 3 : తొలి టి20(ముంబయి)., జనవరి 5 : రెండో టి20(పూణె) జనవరి 7 : మూడో టి20(రాజ్‌కోట్) జరుగనున్నాయి. వన్డే సిరీస్..షెడ్యూల్ ఇలావుంది. జనవరి 10 : తొలి వన్డే(గౌహతి), జనవరి 12 : రెండో వన్డే(కోల్‌కతా), జనవరి 15 : మూడో వన్డే(తిరువనంతపురం) జరుగనుంది.

# బంగారుకొండ మన నిఖత్ జరీన్

## జాతీయ మహిళల బాక్సింగ్‌లో గోల్డ్‌మెడల్ కైవసం



భోపాల్, డిసెంబర్ 26 (సమ సమాజం): జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ గోల్డ్ మెడల్ గెలిచింది. మధ్య ప్రదేశ్ రాజధాని భోపాల్ వేదికగా జరిగిన జాతీయ మహిళల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో 50కేజీల విభాగంలో నిఖత్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో రైల్వేస్‌కు చెందిన అనామికపై 4-1 స్కోరు తేడాతో జరీన్ విజయం సాధించింది. ప్రతిష్ఠాత్మక టోర్నీలో పసిడి పతకాన్ని దక్కించుకున్న నిఖత్..ఈ ఏడాదిని ఘనంగా ముగించింది. జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్ షిప్ లో నిఖత్ జరీన్ అంచనాలకు మించి రాణించింది. 50 కేజీల విభాగంలో బరిలోకి దిగిన ఆమె సెమీస్ లో ఏఐపీకు చెందిన శివిందర్ కౌర్ పై 5-0 తేడాతో విజయం సాధించింది. దీంతో పసిడి పోరుకు చేరుకుంది. ఇక్క÷నైల్లో ఇదే జోరును కొనసాగించిన నిఖత్ జరీన్ మరోసారి తన పంచ్ పవర్ చూపెట్టి...బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఈ ఏడాది ఆడిన అన్ని టోర్నమెంట్లలోనూ గెలిచిన నిఖత్ అజేయంగా నిలిచినట్టయింది. ఈ ఏడాది మొదట్లో స్టాం÷-రజా మెమోరియల్ టోర్నీలో నిఖత్ స్వర్ణాన్ని సాధించింది. ఆ తర్వాత ప్రపంచ చాంపియన్ షిప్ గెలిచి చరిత్ర సృష్టించింది.అనంతరం కామన్వెల్త్ క్రీడల్లోనూ గోల్డ్ మెడల్ గెలిచింది. తాజాగా జాతీయ చాంపియన్ షిప్ లోనూ స్వర్ణాన్ని సొంతం చేసుకుంది.

## కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన బాబర్

### న్యూజిలాండ్‌తో తొలిటెస్ట్‌లో 161 పరుగులు

### 5 వికెట్లకు 317 పరుగులు చేసిన పాక్



కరాచీ, డిసెంబర్ 26 (సమ సమాజం): న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ అజమ్(161నాటౌట్) కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడాడు. న్యూజిలాండ్‌తో సోమవారం నుంచి ప్రారంభమైన తొలిటెస్ట్ తొలిరోజు ఆట ముగిసే సమయానికి పాకిస్తాన్ జట్టు 5 వికెట్లు నష్టపోయి 317పరుగులు చేసింది. బాబర్‌కి తోడు వికెట్ కీపర్ సర్ఫరాజ్ అహ్మద్(86) బ్యాటింగ్‌లో రాణించారు. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ షఫీక్(7), ఇమామ్-ఉల్-హక్(24), మసూద్(3) ఘోరంగా విఫలమయ్యారు. దీంతో పాకిస్తాన్ 48పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో షకీల్(22), బాబర్ కలిసి 4వ వికెట్‌కు 62పరుగులు జతచేశారు. షకీల్ ఔటయ్యాక సర్ఫరాజ్‌తో జతకలిసి బాబర్ 5వ వికెట్‌కు ఏకంగా 194పరుగులు జతకలిపాడు. బాబర్‌కి తోడు అఘా సల్మాన్(3) క్రీజ్‌లో ఉన్నారు. అజాజ్ పటేల్, బ్రాస్‌వెల్‌కు రెండేసి, కెప్టెన్ టిమ్ సౌథీకి ఒక వికెట్ దక్కాయి. ఇరుజట్ల మధ్య రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌తోపాటు మూడు వన్డేల సిరీస్ జరగనుంది.



# గ్రీన్ దెబ్బకు దక్షిణాఫ్రికా విలవిల

## 189 పరుగలకే కుప్పకూలిన జట్టు

మెల్‌బోర్న్,డిసెంబర్26(సమ సమాజం): రెండో టెస్ట్‌లో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ దెబ్బకు దక్షిణాఫ్రికా జట్టు 189పరుగులకే కుప్పకూలింది. బాక్సింగ్ టెస్ట్‌లో భాగం సోమవారం నుంచి దక్షిణాఫ్రికా-ఆస్ట్రేలియా జట్ల మధ్య రెండోటెస్ట్ ప్రారంభమైంది. గ్రీన్(5/27), స్టార్క్(2/39) బౌలింగ్‌లో రాణించారు. ఇక దక్షిణాఫ్రికా జట్టులో జెన్సన్(59), వెర్రెయనె(52) అర్ధసెంచరీలతో రాణించారు. కెప్టెన్ ఎల్గర్(26) వీరి తర్వాత టాప్‌స్కోరర్. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా జట్టు తొలిరోజు ఆట ముసే సమయానికి వికెట్ నష్టపోయి 45పరుగులు చేసింది. ఖవాజా(1) నిరాశపరిచినా.. వార్నర్(32), లబూషేన్(1) క్రీజ్‌లో ఉన్నారు.

# చలన చిత్రం



## ఇండియన్ కిచెన్‌లో ఎన్టీఆర్

యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం ఫ్యామిలీతో కలిసి అమెరికా పర్యటనలో బిజీగా ఉన్నారు. ఆర్ఆర్ఆర్ సినిమా కోసం నెలల తరబడి షూటింగ్.. ఆ తర్వాత ప్రమోషన్ కార్యక్రమాలతో అలసిపోయిన ఎన్టీఆర్ గత కొన్ని నెలలుగా పూర్తి విశ్రాంతిలో ఉన్నాడు. తదుపరి సినిమా కొరటాల శివ దర్శకత్వంలో అంటూ కన్ఫర్మ్ అయినా కూడా ఇప్పటి వరకు షూటింగ్ మొదలు అవ్వలేదు. గత కొన్ని రోజులుగా అమెరికాలో భార్య పిల్లలతో సరదాగా గడుపుతున్న ఎన్టీఆర్ ఇన్‌స్టాగ్రామ్ లో షేర్ చేసిన ఫోటో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అది ప్రమోషన్ పోస్ట్ అయ్యి ఉంటుందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తూ ఉంటే మరి కొందరు మాత్రం ఎన్టీఆర్‌కు నచ్చి పోస్ట్ చేసి ఉండవచ్చు అంటున్నారు.న్యూ జెర్సీలో ఉన్న మన ఇండియన్ రెస్టారెంట్‌కు వెళ్లిన సందర్భంగా కిచెన్‌లో సందడి చేశాడి అంటున్నారు. అక్కడ ఫుడ్‌ను ఆస్వాదించాను అంటూ సోషల్ మీడియా ద్వారా చెప్పుకొచ్చాడు. విదేశీ పర్యటనలో ఉన్న ఇండియన్స్‌కు ఇంత కంటే బెస్ట్ ఇండియన్ ఫుడ్ ఎక్కడ లభించదు అన్నట్లుగా కామెంట్స్ చేశాడు. జునూన్ అనే ఆ రెస్టారెంట్ లో ఆహారం చాలా అద్భుతంగా ఉంది అన్నట్లుగా ఎన్టీఆర్ ప్రశంసించాడు. అంతే కాకుండా అక్కడి వారితో వంటశాలలో ఫొటో దిగి ఇన్‌స్టాలో షేర్ చేశాడు. ఎన్టీఆర్ ఇన్‌స్టా పోస్ట్‌లు చాలా తక్కువగా ఉంటాయి. ఆయన ఏం షేర్ చేసినా కూడా వైరల్ అవుతూ ఉంటుంది. ఇక ఫొటోలో ఎన్టీఆర్ లుక్ గురించి కూడా చర్చ జరుగుతోంది. ఎన్టీఆర్ గడ్డం,మీసాలాతో పాటు ఆయన డ్రస్సింగ్ స్టైల్ చాలా బాగుంది అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.



## వారసుడు
## ఆడియో లాంచ్‌లో రష్మిక స్టెప్పులు అదుర్స్

బ్యూటీ రష్మిక మందన్న క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. 'పుష్ప'తో దక్కిన పాన్ ఇండియా క్రేజ్‌ను తెలివిగా ఎన్ క్యాష్ చేసుకుంటోంది. ఆ సినిమా గుర్తింపుతో వ్యక్తిగతంగా తనను తాను ప్రమోట్ చేసుకుంటుంది. బాలీవుడ్ లోనూ అవకాశాలు రావడంతో? స్టైల్ ఐకాన్ గానూ ఫేమస్ అవుతుంది. డ్రెస్సింగ్ సెన్స్ లో ఎన్నో మార్పులు తీసుకొచ్చింది. న్యూ ట్రెండ్ ని ఫాలోఅవుతూ తనదైన మార్క్ వేస్తుంది. బాలీవుడ్ భామలకు ఏ మాత్రం తగ్గకుండా ముస్తాబవుతుంది. స్టైల్ కా బాప్ అనిపిస్తూనే అగ్గి రాజేసే అందాలతోనూ ఆకట్టుకుంటోంది. ఆరకంగా నార్త్ లో బాగానే ఫేమస్ అవుతుంది. ఇక తెలుగులో తాను సాధించాల్సిందే ఇప్పటికే సాధ్యమైంది. తాజాగా బ్యూటీ ఇదే వేడిలో కోలీవుడ్ ని షేక్ చేయడానికి రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడిప్పుడే అక్కడా స్టార్ హీరోలతో నటిస్తుంది. ప్రస్తుతం విజయ్ హీరోగా నటిస్తోన్న 'వారసుడు'లో ఆయనకు జోడీగా నటిస్తుంది. ఈ నేపథ్యంలో తాజాగా చెన్నైలో జరిగిన ఆడియా లాంచ్ కార్యక్రమంలోనూ సమ్ థింగ్ స్పెషల్ గా స్టేజ్ పై తనదైన మార్క్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకుంది. విజయ్ అభిమానులకు అద్భుతమైన ట్రీట్ ఇచ్చింది. కొరియోగ్రాఫర్ జానీతో పాటు కలిసి రష్మిక సూపర్‌హిట్ 'రంజితమే' పాటకు హుక్ స్టెప్ అందుకుంది. స్టేజ్పై రష్మిక లెగ్ మూవ్ మెంట్ కి ఫ్యాన్స్ పిచ్చెక్కిపోయారు. అప్పట్లో 'సామీ సామీ' అంటు కుర్రాళ్ల గుండుల్లో సెగలు పుట్టిస్తే...ఇప్పుడు 'రంజితమే' అంటూ రంగు పడేలా చేసింది. దీంతో ప్రమోషన్ పరంగా టీమ్ రష్మికపై భారీ ఆశలే పెట్టుకున్నట్లు కనిపిస్తుంది. ఆడియో లాంచ్‌లోనే ఇలా ఉంటే.. ప్రమోషనల్ టూర్స్లో రష్మిక ని ఆపగలమా? అంటూ చర్చించుకుంటున్నారు. తెలుగు వెర్షన్ రిలీజ్ పరంగా రష్మిక కీలకం కానుంది. అమ్మడికి ఇక్కడ మంచి ఫాలోయింగ్ ఉంది. కన్నడ నటి అయినా తెలుగు చక్కగా మాట్లాడగలదు. తనదైన మార్క్ చలాకీ తనంతో

## అనుష్కతో నవీన్ పోలిశెట్టి లవ్ అఫైర్



లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్' సినిమాతో కెరీర్ ప్రారంభించి.. ఆ తర్వాత చిన్న చిన్న పాత్రలు పోషిస్తూ టాలీవుడ్‌లో మంచి నటుడిగా పేరు సంపాదించుకున్నాడు నవీన్ పొలిశెట్టి. కష్టాన్ని నమ్ముకుని ఇండస్ట్రీలో పైకొచ్చిన నటులలో నవీన్ ఒకడు. 'నేనొక్కడినే' సినిమా తర్వాత దాదాపు ఐదేళ్లు సినిమాలకు బ్రేక్ ఇచ్చి.. 'ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ'తో హీరోగా మారాడు. ఈ సినిమా కమర్షియల్ సక్సెస్‌తో పాటు క్రిటిక్స్ నుండి గొప్ప ప్రశంసలు అందుకుంది. అయితే 2019లో వచ్చిన 'జాతి రత్నాలు' మూవీ నవీన్ పొలిశెట్టి కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అయింది. ఈ సినిమాతో టాలీవుడ్‌లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్నాడు. ప్రస్తుతం నవీన్ రెండు సినిమాలను సెట్స్ మీద ఉంచాడు. అందులో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో తెరకెక్కుతున్న రోమ్-కామ్ ఒకటి. అనుష్క శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను మహేష్ బాబు.పి దర్శకత్వం వహిస్తున్నాడు. సోమవారం నవీన్ పుట్టినరోజు సందర్భంగా ఆ సినిమాలోని ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సినిమాలో నవీన్ సిద్ధూ పొలిశెట్టి పాత్రలో నటిస్తున్నాడు. అనుష్క ఈ సినిమాలో చెఫ్‌గా కనిపించనుంది. ఇటీవలే రిలీజైన ఈమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు ప్రేక్షకుల నుండి విశేష స్పందన వచ్చింది. ఓ యంగ్ కుర్రాడికి ఓ మిడిల్ ఏజ్ అమ్మాయికి మధ్య సాగే ప్రేమకథ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. వచ్చే ఏడాది ప్రథమార్థంలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. దీనితో పాటుగా నవీన్ 'అనగనగా ఒక రాజు' సినిమాలో నటిస్తున్నాడు.

## కలెక్షన్లలో దూసుకుపోతున్న ధమాకా

ఎట్టకేలకు రవితేజ ఈ ఏడాది హిట్టు కొట్టాడు. 'ధమాకా' సినిమాతో బాక్సాఫీస్ దగ్గర తన సత్తా ఎంటో నిరూపిస్తున్నాడు. 'ఖిలాడీ', 'రామారావు ఆన్ డ్యూటీ' వంటి బ్యాక్ టు బ్యాక్ ఫ్లాప్‌లతో పట్టుకోల్పోయిన తన మార్కెట్‌ను ధమాకాతో మళ్లీ పుంజుకునేలా చేశాడు. ఇటీవలే రిలీజైన ఈ చిత్రం మొదటి షో నుండి మిక్స్డ్ టాక్ తెచ్చుకుంది. కానీ టాక్‌తో సంబంధంలేకుండా బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్‌ల సునామీ సృష్టిస్తుంది. రోజు రోజుకు ఈ సినిమాపై ఆదరణ పెరుగుతూనే ఉంది. మొదటి రోజుకు మించి మూడో రోజు కలెక్షన్‌లు సాధించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. మొదటి రోజు రూ.10 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసిన ఈ చిత్రం మూడో రోజు రూ.13 కోట్ల వరకు గ్రాస్ కలెక్ట్ చేసి సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇక మూడు రోజుల్లో ఈ చిత్రం రూ.15.37 కోట్లు కలెక్ట్ చేసింది. మరో మూడున్నర కోట్లు సాధిస్తే బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకుంటుంది. ఇక ఇప్పుడున్న జోష్ చూస్తుంటే సోమవారంతో ఈ సినిమా బ్రేక్ ఈవెన్ సాధించడం ఖాయంగా కనిపి స్తుంది. రెండు బ్యాక్ టు బ్యాక్ ఫేయిల్యూర్స్ తర్వాత ఈ సినిమా భారీ విజయం సాధించడంతో రవితేజ అభిమానులు సంబురాలు చేసుకుంటున్నారు. రవితేజ ద్విపాత్రాభినయం చేసిన ఈ సినిమాకు త్రినాథ్‌రావు నక్కిన దర్శకత్వం వహించాడు. క్రాక్ తర్వాత రవితేజ నుండి ఆ రేంజ్ పర్ఫార్మెన్స్ ఈ సినిమాలో ఇచ్చాడు. శ్రీలీల తన నటనతో మరో మెట్టు ఎక్కేసింది. భీమ్స్ సిసిరోలియో తన బాణీలతో ప్రేక్షకులను సీట్లలో కూర్చోనివ్వలేదు. పీపుల్ మీడియా, అభిషేక్ అగర్వాల్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాకు ప్రసన్న కుమార్ బెజవాడ కథ-స్క్రీన్‌ప్లే-మాటలు అందిస్తున్నాడు.

## సమంతకు బూస్ట్ ఇచ్చేలా రాహుల్ రవీంద్రన్ సందేశం



టాలీవుడ్ అగ్రనాయిక సమంత గత కొన్ని రోజులుగా మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూనిటీ డిసీజ్‌తో బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించిన సామ్.. అందుకు అవసరమైన చికిత్స తీసుకుంటున్నానని, త్వరలోనే కోలుకుంటానని ధీమా వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ప్రముఖ నటుడు రాహుల్ రవీంద్రన్.. సమంతకు సందేశంతో కూడిన ఓ గిఫ్ట్ ఇచ్చాడు. 'ఇప్పుడు నీ దారి చీకటిగా ఉండొచ్చు.. కానీ త్వరలోనే అది మెరుస్తుంది. నీ శరీరంలో కదలికలు కష్టంగా ఉండొచ్చు.. కానీ త్వరలోనే అన్నీ బాగుంటాయి. ఎందుకంటే నువ్వు ఉక్కు మహిళవి. నువ్వు ఓ యోధురాలివి..' అని రాసి ఉన్న సందేశాన్ని సమంతకు అందించాడు. ఈ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన సమంత రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపింది. 'కఠినమైన పోరాటాలు చేస్తున్న వారికి ఇది అంకితం. పోరాడుతూనే ఉండండి. అప్పుడే గతంలో కంటే బలంగా




Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in